RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 35 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి శుక్రవారం 13-03-2026 పేజీలు :8 వెల : రూ.1-00

# నీటి వినియోగంలో జాగ్రత్తలు ముఖ్యం



- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జగన్ హయాంలో పెట్టుబడిదారులు పరార్
- జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



**అమరావతి, మార్చి12 (నేటి మనదేశమ్) :** నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య- నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. సంపద సృష్టితో తరువాయి 2లో..

## 'మోడీజి-ఎల్‌పిజి' .. ప్రతిపక్షాల నిరసన



**న్యూఢిల్లీ, మార్చి 12 :** 'మోడీజి -ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్ (పేరు- నరేంద్రమోడీ, పని- లంగిపోవడం)', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంకగాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎప్‌స్టీపిన్ ఫైల్స్, అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోడీ భయపడుతున్నారని, పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురువుతన్నారన్నది స్పష్ట మౌతోందని అన్నారు.

## ఆనాడు ఒక్కడినే..
# ఈనాడు కోట్లాదమందికి అండ

- నల్లకాలువ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు పార్టీ స్థాపన
- కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిండుగా ఉంది.
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వైఎస్ జగన్



**అమరావతి, మార్చి12 (నేటి మనదేశమ్) :** పార్టీ స్థాపన సమయంలో తాను ఒక్కడినే ఉన్నానని, కానీ ఇప్పుడు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదంతో వైసీపీ ఒక పెద్ద శక్తిగా ఎదిగిందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ చెప్పారు. నల్లకాల్వలో ఇచ్చిన మాటే పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమైంది. ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2011 మార్చి 12న స్థాపించబడిన వైసీపీ.. ఇప్పుడు 16వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగన్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి మరణం తర్వాత ఆయన ఆశయాలను కొనసాగిస్తానని, ఆయన మరణాన్ని తట్టుకోలేక చనిపోయిన కుటుంబాలను తరువాయి 2లో..





**విశాఖపట్నం, మార్చి12 (నేటి మనదేశమ్) :**
విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఇప్పటికే నడుస్తున్న ఐటీ పార్కులు, భవిష్యత్తులో రానున్న ఐటీ పార్కులు, గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి మౌలిక వసతుల అభివృద్ధి, ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ప్రభుత్వ అధికారులు, కన్సల్టెంట్ ఏజెన్సీ ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగుహాలులో సమీక్షిస్తున్న రాష్ట్ర ఐటీసెక్రటరీ కాటమనేని భాస్కర్

# విశాఖపట్నంలో రూ.100 కోట్లతో భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్ట్ ప్రాజెక్ట్

### పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో
### ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ముంబయిలో అవగాహన ఒప్పందం



**అమరావతి, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మరో కీలక అడుగు వేసింది. విశాఖపట్నంలో అత్యాధునిక అమ్యూజ్‌మెంట్ పార్క్ మరియు రిసార్ట్ అభివృద్ధి కోసం మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్‌తో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ముంబయిలో జరిగిన ×ూూూ× (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్) ఎక్స్‌పో-2026 వేదికగా పర్యాటక శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'లో భాగంగా, వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నంగా మలిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్ మరియు రిసార్ట్ విస్తరించి ఉండేలా ప్రణాళికలు రచించామన్నారు. ఇందులో 100 గదుల (ఖవఎం) సామర్థ్యం కలిగిన విలాసవంతమైన రిసార్ట్ ఉంటుందని, సుమారు 300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. "మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రధాన కేంద్రంగా 2017లో ప్రారంభమైన మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్, వినోద రంగంలో దాదాపు తొమ్మిదేళ్ల తరువాయి 2లో..


## గ్యాస్ సంక్షోభం..
## ప్యానిక్ బుకింగ్‌తో సర్వర్లు డౌన్




**అమరావతి, మార్చి12 (నేటి మనదేశమ్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభంముదురుతోంది. ప్యానిక్ బుకింగ్‌తో సర్వర్లు డౌన్ అవుతున్నాయని ఆయిల్ కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. ఇండేన్ గ్యాస్ ఐవీ ఆర్ఎస్, వాట్సాప్‌లు బుకింగ్ పని చేయడం లేదు. అప్పుడప్పుడు భారత్, హ్యా గ్యాస్ ఐవీఆర్ఎస్, వాట్సాప్ బుకింగ్‌లు పని చేయట్లేదు. దీనితో గ్యాస్ డీలర్లు వద్దకు వినియోగదారులు పరుగులు తీస్తున్నారు. ఏపీలో కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. బ్యాక్ లాగ్ తగ్గించుకునేందుకు ఆయిల్ కంపెనీలు ఇలా చేస్తున్నాయని వినియోగదారులు తెలిపారు. వినియో గదారుల మొబైల్‌కు ఓటీపీ వస్తేనే డెలివరీ ఇవ్వాలని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లపై ఆయా కంపెనీలు ఆంక్షలు విధించాయి. గ్యాస్ దుర్వినియోగం గాకుండా వినియోగదారుల మొబైల్ నుంచి ఓటీపీ తీసుకుంటున్నామని ఆయిల్ కంపెనీల అధికారులు చెబు తున్నారు. రోజువారి బుకింగ్‌ల కంటే నిన్న ఒక్కరోజే మూడు రెట్లు అధికంగా బుకింగ్‌లు జరిగాయని ప్రభుత్వ అధికారులు తరువాయి 2లో..

# క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఎజత్‌తో లోకేశ భేటీ

### విశాఖలో సంస్థ ఏర్పాటుపై చర్చలు
### విశాఖ టిడిపి ఆఫీస్‌లో లోకేశ్ ప్రజాదర్బార్



**విశాఖపట్నం, మార్చి12 (నేటి మనదేశమ్) :** క్యాప్ జెమినీ గ్లోబల్ సీఈవో ఐమాన్ ఎజత్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో క్యాప్ జెమినీ సంస్థ ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే మధురవాడ ఐటీ పార్కుల్ హిల్-1పై 20 ఎకరాల భూమిని ఈ సంస్థ కోసం పరిశీలించారు. అడివివరం, ఆనందపురం పరిధిలో రెండు చోట్ల సంస్థ ప్రతినిధులు భూములను పరిశీలించారు. తాత్కాలిక కార్యకలాపాలకు సెంట్రల్ పార్కు సమీపంలో ఓ ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేశారు. అలాగే విశాఖ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఐటి సంస్థలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నామని అన్నారు. ఇక తరువాయి 2లో..

## ఏపీ పీజీసెట్..
# 12 వేలకు చేరిన దరఖాస్తులు

వార్త.. 2 లో

## నేటి మనదేశమ్ సంపాదకీయం

### ధాన్యం ఎగుమతి, దిగుమతులను సమీక్షించాలి !

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధానా÷-యల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది.ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యాసవరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు.పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు దమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం మందు ఉండాలో అది ఉండకపోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం,ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్ధతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మన రైతులు ఆనందంగా ఉంటారు.

## పారిశుధ్య సిబ్బందికి అమలు చేస్తున్న పథకాలు, భద్రతపై అవగాహన



**విశాఖపట్నం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర సాధనలో భాగంగా నగరంలోని 20వ వార్డు చినవాల్తేరు రజక వీధి సామాజిక భవనంలో పారిశుద్ధ్య సిబ్బందికి వాష్, సహాస్ సంస్థల ద్వారా శిక్షణను ఇచ్చారు. సుమారు 50 మంది సిబ్బంది పాల్గొన్న ఈ శిక్షణ కార్యక్రమంలో వాష్ ఇన్స్టిట్యూట్ జిల్లా కోఆర్డినేటర్ పి. లలితాదేవి, రిసోర్స్ పర్సన్ హరనాథ్ పాల్గొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలను ఘన వ్యర్థాల నిర్వహణపై చైతన్యం చేసే విధానం, పని ప్రదేశంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్య రక్షణకు పాటించవలసిన...

సూత్రాలు, నమస్తే పథకం విధి విధానాలు, పారిశుద్ధ్య కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరక్టర్ బుచ్చా రామిరెడ్డి, నాగలక్ష్మి, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రకాష్, 20వ వార్డు పారిశుధ్య సూపెర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవ అవగాహన ర్యాలీ

### 40 సంవత్సరాలు దాటిన వారందరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలి




**కొత్తవలస, మార్చి 12 నేటి మనదేశమ్ ప్రతినిధి :** ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాల బహాలో భాగంగా గురువారం ఉదయం వియ్యం పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్య అధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వైద్య అధికారి గోపాలకృష్ణ మాట్లాడుతూ మధుమేహం రక్తపోటు ఉన్నవారు రెగ్యులర్ గా కంటి పరీక్షలు చేయించుకొని 40 సంవత్సరాలు పైబడిన వారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేటి తరంవారు విద్యార్థి దశ నుండి మంచి ఆహారపు అలవాట్లు,జీవన శైలి మార్చుకోవాలని,ముఖ్యంగా అతిగా సెల్ ఫోన్ వాడకం,టివిలను ఎక్కువ చూడడం వల్ల కంటి చూపు తొందరగా పోయే ముప్పు పొంచి ఉందని. ప్రతిరోజు తాజా ఆకుపచ్చని కూరగాయలు క్యారెట్, బొప్పాయి,గుమ్మడి, మునగాకు వంటి ఆహారపదార్థాలు తీసుకోవాలని మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. పరిధిలో ఎవ్వరికైనా కంటి సమస్యలు, కేటరాక్ట్, కను గుడ్డు పై పొరలు ఉన్నా ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఈశ్వరరావు అందుబాటులో ఉంటారని తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు. కంటి చూపును కాపాడుకోండి - గ్లకోమా పరీక్షలు చేయించుకోండి, ఎర్లీ డిటెక్షన్ - సేవ్స్ విజన్. దృష్టిని నిశ్శబ్దంగా దొంగిలించేది గ్లకోమా. - ముందు జాగ్రత్త ముఖ్యం. అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఈశ్వరరావు,ఈ.ఓ. నరసింహారావు, పి. హెచ్. ఎన్. జగదాంబ, హెచ్.వి.పద్మావతి,యూ,డి. సి సురేష్ కుమార్, హెచ్.ఎస్.ఈశ్వరరావు, ఫార్మసీ ఆఫీసర్ ఆశ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎల్.టి.సంతోష్,ఎమ్. ఎల్. హెచ్. పి. లు, ఏ. ఎన్. ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.



**విశాఖపట్నం, మార్చి 12 నేటి మనదేశమ్ :** ఎస్ఎంఎ టైప్ 1 అనే అరుదైన జన్యు పరమైన వ్యాధితో బాధపడుతున్న విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేట కు చెందిన ముని ఆనంద్ కుమారుడు రుషి కుమార్ అనే 5ఏళ్ళ లోపు బాబుకి (11-03-2026) బుధవారం మధ్యాహ్నం 12 గంటలకి నాగవంశం సంక్షేమ సంఘం పెద్దలు,విజయవాడ రాణిగారి తోట 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో నగర నాగవంశం సంక్షేమ సంఘం

కోశాధికారి కాళ్ళ వెంకట రమణ(భారత రమణ) రూ.5000/- , సహాయ కార్యదర్శి డొకర శ్రీను అండ్ బ్రదర్స్ రూ.5000/-

మరో సహాయ కార్యదర్శి రామసింగ్ రవి కోటేశ్వరరావు రూ.5000/-, కమిటీ సభ్యులు బాయి పరమేశ్వర రావు రూ.5000/- సంకురుబోతు ప్రసాద్ రూ.5000/- గాడు రాజబాబు (మణికంఠ ఫర్నిచర్స్) రూ.5000/- సుంకర సూరి (బోర్ వెల్స్) రూ.5000/- వారి ఇంటికి వెళ్ళి ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పి ఇక మీదట కూడా అవకాశం ఉన్నంతవరకు బాబుకు తమ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## నేడు అవంతి కళాశాలలో ' అవెన్సిస్ 2కె26 " యువజనోత్సవాలు

**భీమునిపట్నం మార్చి 12 నేటి మనదేశమ్ :** తగరపువలస అవంతి ఇంజనీరింగ్ (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో "అవెన్సిస్ 2కె26 " పేరుతో జాతీయ స్థాయిలో యువజనోత్సవాలు వేడుకలను 13, 14 వ తేదీలలో రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు గురువారం పత్రికా ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అతిథిలుగా డా. జి. జయసుమ,రిజిస్ట్రార్ జె.ఎన్.టి.యు.గురజాడ, విజయనగరం,మిస్టర్ శ్రీధర్ కోసరాజు, ఎమ్.డి., నిమల్ సాఫ్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, డా. పి.పి. లాల్ కృష్ణ, ఎమ్.డి. సీ.ఈ.ఓ., విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్, మిస్టర్ జి. మురళీకృష్ణ, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, ఉషా నగిశెట్టి, ఇండియన్ బాక్సర్ మేజర్ ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత విచ్చేయునున్నారు. అలాగే అవంతి యువతను కేరింతలతో హుషారైన పాటలతో మెప్పించడానికి ప్లే బ్యాక్ సింగర్ గీతామాధురి విచ్చేయనున్నారు. ఈ యువజనోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడాంశాలు అయినటువంటి బాస్కెట్ బాల్,కబడ్డీ, వాలీబాల్, కోకో, క్రికెట్, త్రోబాల్, చెస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, యోగా, కరాటే, స్లో బైక్ రేస్, ట్రెజరీ హంట్, పాటలు పోటీలు, సోలో నృత్యం, మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీలు నిర్వహించి అత్యున్నత ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రములను అవంతి శ్రీనివాసరావు చేతులు మీదుగా అందచేస్తారని తెలియచేశారు.

## మనోబంధు కార్యక్రమాలు చర్చించిన కమిషనర్

- మానసిక ఆరోగ్యం గురించి అవగాహన అవసరం
- కేతన్ గార్గ్, మున్సిపల్ కమిషనర్, జివిఎంసి

**విశాఖపట్నం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** మనోబంధు ఫౌండేషన్ భవిష్యత్తు కార్యక్రమాలు గురించి మహా విశాఖ మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణ రాజు తో చర్చించారు. గురువారం సాయంత్రం సిరిపురం జంక్షన్ లో విఎం ఆర్ డి ఎ చిల్డ్రన్ ఎరీనా లో కొద్ది సేపు చర్చించారు. ఆంధ్రా", తెలంగాణా రాష్ట్రాలలో గడిచిన నాలుగు ఏళ్ళుగా నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. ఈ అంశం మీద కమిషనర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం గురించి అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. మనొబందు ఫౌండేషన్ భవిష్యత్తు కార్యక్రమాలకు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చాలామంది బాధ పడుతున్న వారికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ చారిటబుల్ సంస్థ అధ్యక్షులు రాచకొండ దశరథ రామయ్య గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.



## వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి



**భీమునిపట్నం, మార్చి 12 నేటి మనదేశమ్ :** ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూషన్ అఫ్ మెడికల్ సైన్సెస్, సంగివలస వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు గురువారం కళాశాల ప్రాంగణం లో డా.ఎన్టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈఏఎస్ఈ (ఎమోషనల్ అసెస్మెంట్ అఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్) - ఏపీ ట్రైనర్లు ఆత్మ హత్యల నివారణ అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెందకుండ దైర్యంగా ఒత్తిడిని ఎదుర్కోవాలని మరియు వైద్య విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి అని సూచించారు. ఈఏఎస్ఈ (ఎమోషనల్ అసెస్మెంట్ అఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్) - ఏపీ ట్రైనింగ్ డైరెక్టర్ నెల్సన్ వినోద్ మోజెస్ మరియు సంగీత మాట్లాడుతూ వైద్య విద్యలో చేరిన ప్రతి విద్యార్థి ఒత్తిడిని సున్నితంగా ఎదుర్కొని, వారి వైద్య విద్యని విజయవంతంగా పూర్తి చేసి సమాజానికి సేవలు అందిచాలని వివరించారు. ఈ ట్రైనింగ్ కోసం ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూషన్ అఫ్ మెడికల్ సైన్సెస్, సంగివలస వైద్య కళాశాల ని ఎంచుకున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏ. భాగ్యలక్ష్మి ఈ ఈఏఎస్ఈ డైరెక్టర్ డా. అపర్ణ ఉప్పలకు ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో డా. కే. నరేష్, డా. ఎస్.ఎస్.కే. ప్రకాష్, డా. కే. విజయ, డా. రేఖా దత్, డా. పి. హిమకర్ మరియు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోర్స్ ట్రైనర్లు నెల్సన్ మరియు సైకాలజిస్ట్ డా. సంగీతలను డా. ఏ. భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ పుష్పగుచ్చం శాలువా తో సత్కరించారు.

## విశాఖపట్నం అభివృద్ధి నారా లోకేష్ తోనే సాధ్యం...

## నారా లోకేష్ నాయకత్వంలో


## విశాఖపట్నం వరల్డ్ క్లాసు సిటీగా అభివృద్ధి చెందుతుంది



**విశాఖపట్నం, మార్చి 12 నేటి మనదేశమ్ :** విశాఖలో పర్యటించిన నారా లోకేష్ విశాఖ అభివృద్ధి కొరకు గురువారం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మధ్యకాలంలోనే గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నం తీసుకొచ్చిన ఘనత నారా లోకేష్ కే చెందుతుంది. ఇటీవల కాలంలో విశాఖలో జీఎంఆర్, మాన్సాస్ ఎడ్యుసిటీ ప్రాజెక్టును ప్రారంభించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఈ మధ్యనే కాగ్నిజెంట్ కంపెనీకి శంకుస్థాపన చేసిన చంద్రబాబు లోకేష్. ఈరోజు విశాఖపట్నంలో గౌరవ మంత్రివర్యులు లోకేష్ని కలిసి కృతజ్ఞతాభినందనలు తెలియజేసిన ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ యాత. ఉత్తరాంధ్రలోలి16 వేల కోట్లతో సిఫి డేటా సెంటర్ ను ప్రారంభిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాం, ఇదేవిధంగా గూగుల్ డేటా సెంటర్ 87,500 కోట్లతో మరియు టిసిఎస్ లక్ష కోట్లతో టి సి ఎస్ డేటా సెంటర్లు విశాఖలో ప్రారంభించడం అభినందనీయం, వీటికి అనుసంధానంగా చాలా కంపెనీలు ఉద్యోగ ఉపాధి కల్పన గురించి రాబోతు న్నాయి, అని అదే విధంగా వెనకబడిన ఉత్త రాంధ్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఉద్యోగ ఉపాధి అవకాశాలు భారీ ఎత్తున లభిస్తాయని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి నుండి కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు. మరియు స్పెషల్ డిఎస్సీ ప్రకటించినందుకు, పోలీస్ శాఖలో 11639 పోస్టు భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వాలని ఐ+ూ గారికి ఆదేశాలు ఇచ్చిన, నారా లోకేష్ గారికి ధన్యవాదాలు, జగన్ ఐదు సంవత్సరాల పరిపాలన లో నిరుద్యోగులు ఉద్యమాలకే పరిమితం అయ్యారు అని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ యాత అన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టిన జగన్ ను చిత్తుగా 11 సీట్లు కు పరిమితం చేసి,ఓడించాలి డీఎస్సీలో మూగ ,చవిటి, కంటి చూపు ఇబ్బంది ఉన్నవారికి, మెంటల్లి రిటార్డేషన్, ఇంటెలిట్యువల్ డిజేబులిటీ, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజేబులిటీ మరియు ఆటిసం ఇబ్బందులతో ఉన్నవారికి పాఠాలు బోధించడానికి స్పెషల్ డిఎస్సి 2018లో నారా చంద్రబాబునాయుడు గారు 860 స్పెషల్ డిఎస్సి పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తరువాత జగన్ ఐదు సంవ త్సరాల కాలంలో నిరుద్యోగులు ఆవేదనతోటే మగ్గిపోయి నిరాహార దీక్షలుతో నిరసనల మయం అయ్యారు. ఈ విషయాలను గమనించిన నారా చంద్రబాబు నాయుడు గారు మరియు నారా లోకేష్ తొలి సంతకం మెగా డీఎస్సీ పైన పెట్టారు,

ఇటీవల ఆయన విశాఖకి వచ్చినప్పుడు స్పెషల్ డిఎస్ ఇవ్వాలని కోరిన దానికి వెంటనే ఆయన స్పందించి, స్పెషల్ డిఎస్సి కి సంబంధించి 2025 నవంబర్లో టెట్ నిర్వహిస్తామని, 2026 జనవరిలో స్పెషల్ డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి ,మార్చ్ నెలలో పరీక్షలు నిర్వహిస్తామని లోకేష్ గారు తెలియ జేయడం మా అందరికీ ఆనందంగా ఉంది. ఉత్తరాంధ్ర ఉత్తరాంధ్ర ప్రజల తరపున ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున లోకేష్ బాబుకి మరియు సీఎం నారా చంద్రబాబునాయుడు గారికి కృతజ్ఞతాభినందనలు పాదాభివందనాలు తెలియ జేసుకుంటున్నాం.

# కంప్యూటర్ అధిక వాడకంతో సమస్యలే..!



ఆధునిక కాలంలో కంప్యూటర్లు.. వ్యక్తి జీవితంలో ప్రధాన వస్తువులుగా మారిపోయాయి. కంప్యూటర్ లేకుండా ఏ పనీ పూర్తి కావడం లేదు. ముఖ్యంగా ఉద్యోగస్తులకు కంప్యూటర్ ప్రధానవస్తువైపోయింది. అయితే కంప్యూటర్ అధిక వినియోగం ఆరోగ్యంపై అనేక దుష్ప్రభావాలను చూపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ సమయం కంప్యూటర్ వద్ద కూర్చొని పనిచేసేవారు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని చెప్తున్నారు. ప్రతిరోజూ కంప్యూటర్ తో పనిచేయాల్సి రావడం ఆధునిక జీవితంలో తప్పని పరిస్థితిగా మారింది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కంప్యూటర్ దగ్గర ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల కళ్ళకు ప్రమాదమేనంటున్నారు. కళ్ళు లాగడం, నొప్పి, కంటినుంచీ నీరు కారడం, మంటలు వంటి అనేక సమస్యలతో పాటు కొందరికి దృష్టిలోపం కూడ ఏర్పడుతుందని చెప్తున్నారు. దీర్ఘకాలం కంప్యూటర్ ముందు కూర్చొనే వారిలో ఫిజికల్ యాక్టివిటీ తగ్గడం వల్ల శరీరం బరువెక్కడం, ఉబకాయం సమస్యతోపాటు సోమరులుగా కూడ మారే అవకాశం ఉందంటున్నారు. ఎక్కువ సమయం కంప్యూటర్లను వాడటంవల్ల దీర్ఘ కాల రోగాలైన ఉబ్బసం, రక్తపోటు వంటి రోగాలు సంక్రమించడంతోపాటు కొందరిలో నిరాశ చుట్టుముట్టి మానసిక వ్యాధులకు కూడ దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరిలో ఆహారం పట్ల విముఖత ఏర్పడితే, మరి కొందరిలో అదేపనిగా తినే అలవాటుకూడ వస్తుందని, దీనివల్ల ఊబకాయ సమస్య ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

ఎక్కువ సమయం కంప్యూటర్ వద్ద కూర్చోవడం వల్ల ఒళ్ళు నొప్పులు, మెడనొప్పులు, స్పాండిలైటిస్ వంటివి కూడ ప్రధాన సమస్యలుగా మారతాయని వైద్య నిపుణుల పరిశీలనలో కనుగొన్నారు. కంప్యూటర్లో పనిచేసే వ్యక్తులకు దీర్ఘకాలిక తలనొప్పులు సంక్రమించే అవకాశం కూడ ఉంది.

అటువంటి నొప్పి ఒక్కోసారి డిప్రెషన్ కు కూడ దారితీస్తుంది. నొప్పుల వల్ల శరీరంలో శక్తి సామర్థ్యాలు తగ్గిపోవడం, అతిగా ఆలోచించడం వంటి లక్షణాలు ఏర్పడ తాయని పరిశోధకులు చెప్తున్నారు.

అయితే తప్పనిసరిగా కంప్యూటర్ తో పనిచేయాల్సి వచ్చిన వారు కొన్ని జాగ్రత్తలు మాత్రం తీసుకోవాలని సూచిస్తున్నారు.

ముఖ్యంగా 45 ఏళ్ళు పైబడిన వారిలో ఈ సమస్యల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నవాస్తవం బయటపడిందని పరిశోధకులు చెప్తున్నారు.

తప్పనిసరిగా వ్యాయామం చేయడం, గంటకోసారైనా కాసేపు అటూఇటూ తిరగటం, వాడే సమయంలో అప్పుడప్పుడూ నీటితో ముఖం కడుక్కోవడం, ఎక్కువసార్లు కనురెప్పలు మూసి తెరుస్తుండటం, స్క్రీన్ కు వీలైనంత దూరంగా కూర్చోవడం, వంటివి కంప్యూటర్ వినియోగదారులు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు.

అంతేకాక ముఖానికి ఎదురుగా లైట్ లేకుండా చూసుకోవడం, మానిటర్ కళ్ళకు ఎదురుగా సమానమైన ఎత్తులో ఉండేలా చూస్కోవడం, మౌస్ ప్యాడ్ వాడటం, తక్కువ రేడియేషన్ ఇచ్చే మానిటర్స్ ను వాడటం చేయాలంటున్నారు. కంటికి ఒత్తిడి తగ్గేలా యాంటీ గ్లేర్ స్క్రీన్ల వాడకం వంటి కొన్ని కనీస జాగ్రత్తలను పాటిస్తే సమస్యలకు దూరంగా ఉండొచ్చని కొంతైనా ఉపశమనం పొందవచ్చని వైద్యులు చెప్తున్నారు.

# ఉల్లాసంతో వృద్ధాప్యం దూరం



నేటి బాలలే రేపటి పౌరులు. అలాగే నేటి పౌరులే రేపటి పెద్దలు, వృద్ధులు! మనం విస్మరించటానికి వీల్లేని జీవన సత్యం ఇది. వయసును ఆపలేంగానీ వయసుతో పాటు మొదలయ్యే రకరకాల వ్యాధుల నుంచి.. ఆ బాధల నుంచి తప్పించుకోవటం మాత్రం చాలా వరకూ మన చేతులో ఉన్న వ్యవహారమే. చాలామంది ముసలితనంలో జబ్బులు సహజమని నమ్ముతుంటారుగానీ నిజానికి యుక్తవయసు నుంచే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ..

మలివయసు వారిని ప్రతి నిత్యం ఇబ్బందికి గురిచేసే ముఖ్యమైన సమస్య మలబద్ధకం. తగినంత శారీరక శ్రమ లేకపోవటం, దానికి తోడు సరిగా నమల లేక పీచు పదార్థాలు-కూరగాయల వంటివి బాగా తగ్గించి, నమలాల్సిన అవసరం అంతగా లేని తేలిగ్గా తినటానికి వీలైన శుద్ధి చేసిన పదార్థాలనే ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్య మరింతగా ముదురుతుంది. కాబట్టి దీనికి పరిష్కారమేమిటో మనకు తేలిగానే అర్థమవుతోంది. పీచు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు, ముడి ధాన్యాల వంటివి ఎక్కువగా తినాలి. నీరు సమృద్ధిగా తాగాలి. పీచులేని, బాగా శుద్ధి చేసిన పదార్థాలు తగ్గించాలి. ముఖ్యంగా ప్రతిరోజూ మలవిసర్జన జరిగితేనే హాయిగా ఉంటుందన్న భావన నుంచి బయటపడటం అవసరం. మలవిసర్జన- రోజుకు మూడు సార్ల నుంచీ వారానికి మూడు సార్ల వరకూ... సహజమే. కాబట్టి ప్రతి రోజూ విసర్జన జరగాల్సిందేనన్న భావనతో ఆలోచనలన్నీ దానిచుట్టూనే తిప్పుకోవటం అనవసరం.

ఒక వయసుకు రాగానే కంటిలోని కార్నియా పౌర దళసరిగా తయారై శుక్లాలు రావటం కూడా సహజం. దీనికి ఇప్పుడు- శుక్లాన్ని తొలగించి కంటిలోనే లెన్సును అమర్చే సమర్థమైన సర్జరీ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఒక వయసుకు వచ్చేసరికి వినికిడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో అధిక పౌనఃపున్యం ఉండే ధ్వనులు సరిగా వినపడవు. చాలామంది వినికిడి తగ్గిందన్న విషయాన్ని అంగీకరించటానికే ఇష్టపడరు. ఒకవేళ దాన్ని అంగీకరించినా, వెద్యులకు చూపించుకోవటానికి ఇష్టపడరు. కానీ దీనివల్ల నలుగురిలో కలవలేకపోవటం, ఎవరేమంటారోనని చిన్నతనంగా భావిస్తుండటం, సమాజానికి దూరం కావటం, క్రమేపీ కుంగుబాటులోకి జారిపోవటం వంటి సమస్యలన్నీ బయల్దేరతాయి. కాబట్టి వినికిడి తగ్గుతోందనిపిస్తే తోసేసుకుని తిరగటం కాకుండా.. వెద్యులకు చూపించుకుని అవసరమైతే తేలికపాటి వినికిడి యంత్రాల వంటివి తీసుకోవటం ద్వారా చక్కటి సామాజిక జీవితాన్ని గడపొచ్చని గుర్తించాలి.

ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకుంటే మలివయసు కూడా చక్కటి ఆరోగ్యంతో ఎంతో ఆహ్లాదంగా, హాయిగా గడచిపోతుంది. అందుకే యుక్తవయసులో చక్కటి జీవన సరళిని అలవరచుకోవటమంటే ఒక రకంగా మలివయసుకు మనం చేసే 'జీవిత బీమా' అది. అలాగే మలివయసుకు వచ్చేసరికి చాలామంది 'ఈ వయసులో వ్యాధులు సహజమే' అనుకుంటారు గానీ అది సరికాదు. నేడు మనకు అందుబాటులో ఉన్న వెద్య పరిజ్ఞానం, సదుపాయాలతో ఏ వయసులోనైనా వ్యాధులతో ఇక్కట్లు పడాల్సిన అవసరం లేదు. దీనికి కావాల్సిందల్లా.. కాస్త ముందుగా మేల్కొనటం. అందుకే మలివయసులో తరచుగా పలకరించే సమస్యలేమిటో, వీటికి నేటి వెద్యరంగం అందించే వివరాలేమిటో క్లుప్తంగా చూద్దాం.

**మోకాళ్ల నొప్పులు:** ఒక వయసుకు వచ్చే సరికి ఎంతోమందికి జీవితంలో నరకం చూపిస్తున్న పెద్ద సమస్య మోకాళ్ల నొప్పులు. దీనికి ప్రధానంగా మోకాలిలోని కీలు, ఎముకలు, వాటి మధ్య కదలికలు మృదువుగా ఉండేలా చూస్తుండే సున్నితమైన మృదులాస్థి పొరలు అరిగిపోవటం ముఖ్యకారణం. 55-60 ఏళ్ల వయసు తర్వాత దాదాపుగా సగానికి సగం మంది ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య ఇది. తీవ్రమైన మోకాళ్ల నొప్పి వల్ల నడక నరకంగా తయారై కదల్లేకపోతుంటారు. దీనివల్ల శారీరక శ్రమ తగ్గి మరింత బరువు పెరగుతారు. బరువు పెరిగినకొద్దీ మోకాళ్ల నొప్పులు మరింత సతాయిస్తాయి. ఇలా ఇదో విషవలయంగా తయారవుతుంది. అందుకని పెద్దవయసులో సాధ్యమె%నంత వరకూ బరువు పెరగకుండా చూసుకోవటం మంచిది.

అలాగే బరువు ఎక్కువగా ఉంటే తగ్గాలి. బరువు తగ్గితే మోకాళ్లు అరిగిపోయే ముప్పు కూడా తగ్గుతోందని 'ఫ్రేమింగ్‌హ్యామ్ ఆస్టియో ఆర్త్రైటిస్' అధ్యయనంలో స్పష్టంగా గుర్తించారు. కొద్దిగా మోకాళ్ల నొప్పులున్నా కదలికలు మానెయ్యకూడదు, రోజువారీ ఓ మోస్తరు నడక, వ్యాయామాలు కొనసాగించాలి. ఇప్పుడు మోకాళ్ల నొప్పులకు మంచి చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. వెద్యులను సంప్రదిస్తే పరీక్షలు చేసి, సమస్య ఏ స్థాయిలో ఉంది, దీనికి ఏం చెయ్యొచ్చన్నది వివరిస్తారు. యుక్తవయసు నుంచీ చక్కటి వ్యాయామాలు చేస్తుండటం వల్ల చాలా వరకూ ఈ సమస్య దరిజేరకుండా చూసుకోవచ్చు. ఎప్పుడో వారాంతాల్లో ఒక్కసారిగా, విపరీతంగా వ్యాయామం చెయ్యటం కాకుండా.. రోజూ విడవకుండా, నిలకడగా నడక వంటి వ్యాయామాలు చెయ్యటం వల్ల మోకీలు చుట్టూ ఉండే కండరాలు బాగా బలపడతాయి. దానివల్ల భారం మొత్తం కీలే మొయ్యాల్సిన పరిస్థితి ఉండదు. ఫలితంగా కీలు అరుగుదలా తగ్గుతుంది. ఎక్కువగా గొంతికూర్చోకుండా ఉండటం, ఎత్తు మడమ చెప్పులు (హైహీల్స్) వాడకుండా ఉండటం కూడా మోకీళ్లకు మంచిది.

**ఎముకలు విరగటం:** యవ్వనంలో తెలియకుండా తిరిగేస్తాం కానీ ఒక వయసుకు వచ్చేసరికి ఎముక క్షీణత ఎక్కువగా ఉంటుంది. 45-50 ఏళు దాటిన వారిలో ఎముకలు ఎండుపుల్లల్లా పెళుసుగా, బోలుగా తయారవ్వటమన్నది చాలా ఎక్కువ. ఈ ముప్పు స్త్రీలలో మరీ ఎక్కువ. దీనివల్ల చీటికీమాటికీ పడిపోవటం, ఏ చిన్న దెబ్బ తగిలినా ఎముకలు విరిగిపోవటం చాలా తరచుగా చూస్తుంటాం. పైగా ఒకసారి విరిగితే వీరిలో అంత త్వరగా అతకవు కూడా. దీంతో మొత్తానికి కదలికలు తగ్గిపోవటం, తన పని తాను చేసుకునే పరిస్థితి కూడా లేకపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఎముక సాంద్రత తగ్గటం వల్ల వెన్నుపూసలు విరిగిపోవటం కూడా వీరిలో ఎక్కువే. అసలీ ఎముక బోలు సమస్య (ఆస్టియోపొరోసిస్) వృద్ధాప్యంలో చాలా సహజమని అంతా నమ్ముతుంటారుగానీ ఇది నిజం కాదు. ముందు నుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీని బారిన పడాల్సిన అసరమే లేదు. పొగ తాగకుండా ఉండటం, క్యాల్షియం దండిగా ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవటంఅవసరం. మన జీవక్రియలకు తగినంత క్యాల్షియం అవసరం. మన ఆహారంలో క్యాల్షియం తగినంత లేకపోతే మన శరీరం దాన్ని ఎముకల నుంచి వెనక్కి తెచ్చుకుంటుంది. దీంతో ఎముకలు బలహీనపడతాయి. అలాగే కడుపులో బిడ్డ ఎదిగేటప్పుడు, బిడ్డకు పాలిచ్చేటప్పుడు స్త్రీ శరీరం నుంచి చాలా క్యాల్షియం బిడ్డకు వెళ్లిపోతుంది. దీంతో స్త్రీలు ఆస్టియోపొరోసిస్ బారినపడే అవకాశాలు చాలా ఎక్కువ. కాబట్టి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాల పదార్థాలు, ఆకుకూరలు, సోయా, గోబీ, చేపల వంటివి తీసుకోవాలి. ఈ తీసుకున్న క్యాల్షియం ఎముకలకు పట్టేందుకు వ్యాయామం చెయ్యటం కూడా అవసరం. అలాగే కాస్త ఎండలో తిరిగితే విటమిన్-డి దక్కుతుంది, ఎముక బలానికి ఇదీ ముఖ్యమే. ఒక వయసు రాగానే అందరూ వెద్యులను సంప్రదించి ఎముక సాంద్రత పరీక్ష చేయించుకుని, ఆస్టియోపొరోసిస్ ఉంటే తగు జాగ్రత్తలు, చికిత్స తీసుకోవటం అవసరం. అలాగే బాత్రూముల్లో పడిపోకుండా నేల నునుపుగా జారిపోయేలా లేకుండా చూసుకోవటం, ఇంట్లో నడిచేటప్పుడు పరిస్థితిని బట్టి నాలుగుకోళ్ల కర్ర సాయం తీసుకోవటం, తల తిప్పు, తూలు రావటం వంటి లక్షణాలు కనబడుతుంటే తక్షణం వైద్యులకు చూపించుకుని, చికిత్స తీసుకోవటం కూడా చాలా అవసరం.

**జ్ఞాపకశక్తి లోపం:** వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తి తగ్గేమాట కొంత వాస్తవమే అయినా ఇది అందరికీ రావాలనేం లేదు. ముఖ్యంగా తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటి సమస్యల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనబడే అవకాశం లేకపోలేదు. వృద్ధాప్యంలో కుంగుబాటు (డిప్రెషన్) చాలా ఎక్కువ కూడా.

కాబట్టి ఇలాంటివేమైనా ఉన్నాయేమో వైద్యులకు చూపించుకోవచ్చు. ఎంత వయసు వచ్చినా శరీరాన్నీ, మెదడునూ చురుకుగా ఉంచుకోవటం అవసరం.

# బరువు తగ్గాలనుందా?.. ఈ చిట్కాలు మీకోసమే!



మనలో చాలా మంది అధిక బరువుతో బాధపడుతుంటారు. బరువును తగ్గించుకోడానికి నానాపాట్లు పడుతుంటారు. బరువులు ఎత్తడం, పరిగెత్తడం, నీరు ఎక్కువగా తాగడం లాంటివెన్నో చేస్తుంటారు. కానీ, కొన్ని సార్లు ఆశించినంత ఫలితం ఉండదు. ఎందుకంటే బరువును తగ్గించుకోవడంలో జీవక్రియదే ప్రధాన పాత్ర. దానిని మెరుగు పరచుకుంటేనే అనుకున్నది సులువుగా సాధించవచ్చు. జీవక్రియ సరిగా ఉంటే కేలరీలు సులువుగా ఖర్చయిపోయి అధిక బరువు సమస్య దరి చేరదు. అయితే, వయస్సు పెరుగుతున్న కొద్దీ దీనిరేటు క్రమంగా తగ్గిపోతుంది. ఈ క్రమంలో బరువును అదుపులో ఉంచుకోవడానికి కొన్ని నియమాలు పాటిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూద్దామా

**1. సమపాళ్లలో తీసుకోండి**

శరీరానికి ప్రోటీన్లు, కొవ్వులు, పిండిపదార్థాలు స్తంభాల్లాంటివి. ఇవన్నీ అవసరమైన స్థాయిలో ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క. మీ జీవక్రియ సక్రమంగా జరగాలంటే ఆహారంలో ఈ మూడింటినీ సమపాళ్లలో తీసుకోండి. ఇవన్నీ రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించి జీవక్రియ మెరుగు పరుస్తాయి.

**2. ఎక్కువసార్లు తినడం తప్పేకాదు**



రోజులో ఎక్కువసార్లు తింటే అనారోగ్యం పాలవుతారని చాల మంది అభిప్రాపడుతుంటారు. కానీ, అది చాలా తప్పు. మీరు భోజనం మధ్యలో చిరుతిళ్లు తింటే రక్తంలో చక్కెర స్థాయి కంట్రోల్ అవుతుంది. అంతేకాకుండా జీవక్రియ వేగతం పెంచుతుంది. అందువల్ల తక్కువ తక్కువగా ఎక్కువగా సార్లు తినడానికి ప్రయత్నించండి.

**3. ఎన్ని కేలరీలు తింటున్నామో లెక్కలేయొద్దు**

అయ్యో.. లావయిపోతున్నామే. ఎన్ని కేలరీలు తినేస్తున్నామో అంటూ చాలా మంది తెగ హైరానా పడిపోతుంటారు. ఎన్ని కేలరీలు తీసుకుంటున్నామో లెక్కలేసుకొని, క్రమంగా వాటిని తగ్గించేస్తుంటారు. అది మంచి పద్ధతి కాదని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల మన శరీరం శక్తిని కోల్పోయి. జీవక్రియ రేటు మందగిస్తుంది.

**4. టిఫిన్ పెంచండి.. భోజనం తగ్గించండి**

సాధారణంగా మనం పని చేయాడానికి కావాల్సిన శక్తి ఉదయాన్నే తినే అల్పాహారం ద్వారానే లభిస్తుందంటారు. పడుకునే సమయంలో అవయవాలన్నీ విశ్రాంతి తీసుకోవడం వల్ల జీవక్రియ రేటు మందగిస్తుంది. ఈ సమయంలో తక్కువ ఆహారం తీసుకోవడం మంచిది. అల్పహారంలో అన్ని రకాల ప్రోటీన్లు, విటమిన్లు, పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి. అల్పహారమే ఎక్కువగా తీసుకోవాలన్నది నిపుణుల వాదన.

**5. నీరు ఎక్కువగా తాగండి**

జీవక్రియలో నీరు చాలా ముఖ్యం. నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు సులువుగా బయటకు పోతాయి. అంతేకాకుండా ఎక్కువ కేలరీలు ఖర్చవ్వడంలో నీరు సహకరిస్తుంది. శరీరంలో నీటి శాతం తక్కువగా ఉంటే జీవక్రియ రేటు పడిపోతుంది.

**6. ఫైబర్ ఎక్కువగా ఉండాలి**

పీచుపదార్థాల్లో సున్నా కేలరీలు ఉంటాయి. కొవ్వులు కరిగించడంలో ఫైబర్ సహాయపడుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చూస్తుంది. ఫలితంగా జీవక్రియ మెరుగుపడుతుంది. ఇందుకోసం మీ ఆహారంలో బీరకాయ, బీన్స్ తదితర పదార్థాలు ఉండేలా చూసుకోవడం మంచింది. బీన్స్‌లో ప్రోటీన్లు కూడా విరివిగా లభిస్తాయి.

**7. కొవ్వులూ మంచివే!**

కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే అధికబరువు వస్తుందని చెబుతుంటారు. అయితే అన్ని రకాల కొవ్వుల వల్ల ఇలా జరగదు. మనం తీసుకునే ఆహారంలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటే జీవక్రియ వేగం మెరుగుపడుతుందని అధ్యయనాల్లో తేలింది.

**8. స్నాక్స్ తినడం మానొద్దు**

బరువు తగ్గాలనుకునే వారు చాలా మంది ముందుగా స్నాక్స్ తినడం మానేస్తుంటారు. ఆ సమయంలో ఏమీ తీసుకోకపోతే బాగా ఆకలి అనిపిస్తుంది. భోజనం సమయంలో మనకు తెలియకుండానే కాస్త ఎక్కువ తినేస్తాం. అందువల్ల వీలైనంత వరకు అప్పుడప్పుడూ స్నాక్స్ తినాల్సిందే. బదులుగా ఆహారం తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. స్నాక్స్‌లో కొవ్వు పదార్థాలు, కార్బోహైడ్రేట్లు ఉండేట్లు చూసుకోవాలి. భోజనంలో వీటికి తక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. దీనివల్ల జీవక్రియ రేటు పెరిగి ఆరోగ్యంగా ఉంటాం.



# గర్భం వాయిదానే ఉత్తమ మార్గం..!

దోమకాటువల్ల వ్యాప్తి చెందే జికా వైరస్... ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తోంది. ముఖ్యంగా జికా వైరస్ అమెరికాలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ హెచ్చరిస్తోంది. ఇప్పటికే బ్రెజిల్ లో దాదాపు పది లక్షలమందికి జికా సోకి కలకలం రేపడమే కాక మెల్లగా ఇతర ఖండాలకూ విస్తరిస్తోంది. ఈ వైరస్ గర్భిణులకు సోకితే పుట్టబోయే పిల్లలకు మెదడు లోపాలు తలెత్తే అవకాశం పెద్ద ఎత్తున ఉండటంతో డబ్ల్యూ హెచ్ వో వైరస్ ను నిలవరించేందుకు భారీ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా వైరస్ వ్యాప్తి చెందుతున్న దేశాల్లోని మహిళలు గర్భధారణను ప్రస్తుత సమయంలో వాయిదా వేసుకోవడం మంచిదని హెచ్చరిస్తోంది. పిల్లల పుట్టుకలో లోపాలను నివారించడానికి వ్యాక్సిన్లకు బదులుగా ఈ పద్ధతిని పాటించడం ఉత్తమ మార్గమని చెప్తోంది. జికా వైరస్ సోకిన వెంటనే సాధారణ ప్రజల్లో లక్షణాలు పెద్దగా కనిపించకపోయినా గర్భిణులపై మాత్రం ఈ వైరస్ ప్రభావం అత్యధికంగా ఉంటోంది. జికా తల్లికి పుట్టిన బిడ్డ మెదడులోపంతో ఉండటం ప్రపంచ ఆరోగ్యసంస్థకు పెద్ద సవాలుగా మారింది. దీంతో మహిళలకు ముందు జాగ్రత్త చర్యలను సూచిస్తున్నారు. గర్భం ధరించాలనుకున్న వారు జికా వ్యాప్తి చెందుతున్న సమయంలో వాయిదా వేసుకోవాలని, వ్యాక్సిన్లు వేసినప్పటికీ జికా తల్లులకు పుట్టే బిడ్డలు మెదడు లోపాలతో పుట్టే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే జికా వ్యాప్తి చెందిన అన్ని దేశాల్లో హెచ్చరికలను జారీ చేసిన నిపుణులు.. లైంగిక కార్యకలాపాల వల్ల అనుకున్నదానికంటే ఎక్కువగా వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పుట్టే పిల్లల్లో మైక్రో సెఫిలి నివారించాలంటే గర్భాన్ని వాయిదా వేసుకోవడమే సరైన మార్గమని హెచ్చరిస్తున్నారు. ఈడిస్ ఈజిప్టె రకం దోమలు కుట్టడంద్వారా జికా సంక్రమిస్తుందని మొదట్లో తెలిసినా... లైంగిక కార్యకలాపాలు, ముద్దులు, తినే వస్తువులు మార్పిడితో లాలాజలం వల్ల కూడ జికా ఒకరినుంచీ ఒకరికి సోకే అవకాశం ఉందని తాజా పరిశోధనలద్వారా కనుగొన్నారు. దీంతో కొన్ని దిద్దుబాట్లను చేసిన ఏజెన్సీలు... జికా ప్రభావిత ప్రాంతాల్లో కొత్త మార్గదర్శకాలను విడుదల చేశారు. ఇందులో భాగంగా పునరుత్పత్తి వయసులోని పురుషులు, మహిళలు గర్భధారణ జరగకుండా చూసుకోవాలని, వాయిదా వేసుకోవడం అన్నిరకాలుగా మంచిదని చెప్తున్నారు.



# యుద్ధం ఆపండి

- కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థలు కుదేలు - ప్రజలపై అధిక భారాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ కార్మిక సంఘాల నిరసన




**విశాఖపట్నం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు మాట్లాడుతూ ఆయిల్ మీద పెత్తనం కోసం అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై ఈ యుద్ధం చేస్తున్నాయన్నారు. దీన్ని తక్షణం ఆపాలని, లేనిపక్షంలో దేశ ఆర్థిక వ్యవస్థ, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. దేశంలో గ్యాస్ కొరత నెలకొందన్నారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా తగ్గిపోవడం వల్ల హోటళ్లు, గిగ్ వర్కర్లు, తోపుడుబండ్ల కార్మి కులు, హాస్టల్స్ ఇలా ప్రతి రంగం అతలాకు తలమవుతున్నాయన్నారు. మన దేశం నుండి ఎగుమతయ్యే రొయ్యలు, గుడ్లు, అరటి పండ్లు, ఉల్లిపాయలు వంటివి ఎగుమతి కాకుండా ఆగిపోయాయన్నారు. దేశ ప్రయోజనాలరీత్యా మోడీ తన విధానాలను మార్చుకొని యుద్ధం ఆపేందుకు కృషి చేయాలన్నారు. యుద్ధం వద్దని ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయాలని కోరారు. ఐక్యరాజ్యసమితిలో యుద్ధం ఆపాలని భారత ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మోడీ కనీసం నోరు విప్పకపోవడం వల్ల దేశం తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. యుద్ధం వల్ల కలిగిన నష్టాన్ని తెలియజేశారు. ఇప్పటికే పాకిస్తాన్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.350 దాటిందన్నారు. భారత దేశంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60కు పెంచారని, భవిష్యత్తులో చమురు నిక్షేపాలు నిల్వలు లేవని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. దేశంలో చమురు ధరలు పెరిగితే ప్రజలు వాడే నిత్యావసర ధరలన్నీ పెరుగు తాయన్నారు. తక్షణమే యుద్ధం ఆపి ప్రపం చంలో శాంతి నెలకొల్పాలన్నారు. కార్య క్రమంలో సిఐటియు నాయకులు కెఎం.కుమార మంగళం, పి.మణి, పి.వెంకట రావు, కె.కుమారి, వై.రాజు, గణేష్, ఎం.సుబ్బా రావు, ప్రకాశరావు, ఎఐటియుసి నాయకులు బూసి వెంకటరావు, ఎస్‌కె.రెహ మాన్, పడాల రమణ, కె.సత్యనారాయణ, కె.సత్యాం జనేయ, కాసు బాబు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లిలో... యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అనకాపల్లి కూరగాయల మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనంలో భాగంగానే ఈ యుద్ధం సాగు తోందన్నారు. ఇరాన్‌పై తక్షణం దాడులను ఆపాలని కోరారు. ఈ యుద్ధంతో ప్రపంచ దేశాల్లో, ముఖ్యంగా భారతదేశంలో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ ధరలను కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిందని, హోటల్స్‌కు గ్యాస్ సరఫరాను కుదించిందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు కారణమైందని తెలిపారు. చమురు నిక్షేపాల కోసం అమెరికా పన్నుతున్న కుట్రలను ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇరాన్‌పై చేస్తున్న దాడుల్లో పసిపిల్లల ప్రాణాలు పోతు న్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తేలయ్యబాబు, ఎ.రాజు, అప్పారావు, నాయుడు, సురేష్, చలపతి, పాపారావు పాల్గొన్నారు.

# గ్యాస్ సంక్షోభం



- వాణిజ్య సిలిండర్ల ఫిల్లింగ్ పూర్తిగా నిలిపివేత
- నిల్వల మేరకు అరకొరగా సరఫరా
- అందరికీ అందని సిలిండర్లు
- ఇదే పరిస్థితి కొనసాగితే నేడో రేపో ఒక్కొక్కటిగా మూత
- సమస్య పరిష్కరించాలంటూ జేసీని కలిసిన హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు

**విశాఖపట్నం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో విశాఖపట్నంలో ఏకంగా ఆ సిలిండర్ల ఫిల్లింగ్‌నే ఆపేశారు. నిల్వలు ఉన్నంత మేరకు గ్యాస్ ఏజెన్సీలకు, వారి నుంచి ముఖ్యమైన ఖాతాదారులకు మాత్రమే అవి అందుతున్నాయి. ఇంతకు ముందులా అడిగిన వ్యాపారులందరికీ వాణిజ్య సిలిండర్లు ఇవ్వడం లేదు. డీలర్లకు మంగళవారం నుంచే పూర్తిగా ఆపేశారు. కొందరికి బుధవారం అరకొరగా ఇచ్చారు. గురువారం నుంచి ఇక అవి కూడా ఉండవని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నగరంలోని హోటళ్లు ఒక్కొక్కటిగా మూతపడే పరిస్థితి వస్తుంది. దీనిని తప్పించడం కేంద్రం మినహా ఇంకెవరి వల్ల కాదని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. విశాఖపట్నంలో పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న హోటళ్లు, మెస్‌లు, రోడ్డు పక్కన టిఫిన్ దుకాణాలన్నీ కలిపి సుమారు రెండు వేల వరకు ఉన్నాయి. వాటికి సగటున రోజుకు నాలుగు వేల వాణిజ్య గ్యాస్ సిలిండర్లు అవసరం. ఆ మేరకు సరఫరా జరిగితేనే అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు నడుస్తాయి. ప్రస్తుతం కొందరి వద్ద అరకొరగా ఉన్న నిల్వలను వారికి ముఖ్యమైన హోటళ్లకు అంటే...రెగ్యులర్‌గా తీసుకుంటూ, వెంటనే బిల్లులు ఇచ్చే వారికి మాత్రమే అందిస్తున్నారు. అవి కూడా ఎనిమిది అవసరమైన చోట నాలుగు, ఐదు అడిగిన వారికి రెండు చొప్పున ఇస్తున్నారు. మిగిలిన వారికి అవి కూడా అందడం లేదు. ఒక స్థాయి కలిగిన హోటళ్లు, రెస్టారెంట్లు కొద్దిమొత్తంలో అంటే రెండు రోజులకు సరిపడా గ్యాస్ సిలిండర్లను అందుబాటులో ఉంచుకుంటాయి. ప్రస్తుతం సరఫరా ఆగిపోవడంతో అవి కూడా అయిపోవస్తున్నాయి. గురువారం నుంచి సిలిండర్లు ఇవ్వకపోతే హోటళ్లను నడపలేని పరిస్థితి ఉంది.

**అందుబాటులో 1.08 లక్షల డొమెస్టిక్ సిలెండర్లు**

జిల్లా అధికారుల సమాచారం ప్రకారం వాణిజ్య సిలిండర్ల ఫిల్లింగ్ ఆగిపోయింది. కేవలం డొమెస్టిక్ సిలిండర్లు మాత్రమే ఫిల్లింగ్ చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 1.08 లక్షల డొమెస్టిక్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. ఏ రోజుకారోజు అదనంగా వస్తాయి. జిల్లాలో మొత్తం 62 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా 9 లక్షల మంది గృహ వినియోగదారులు ఉన్నారు. వారిలో రోజుకు 20 నుంచి 25 వేల మంది సిలిండర్లు బుక్ చేసుకుంటారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బంది లేదు. అయితే ఒకసారి గ్యాస్ డెలివరీ తీసుకున్న తరువాత వెంటనే మళ్లీ బుకింగ్ కాదు. రెండో సిలిండర్ బుకింగ్ కనీసం 25 రోజుల సమయం తీసుకోవాలి. అదే డబుల్ సిలిండర్లు ఉన్నట్టయితే 30 రోజులలోపు బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండదు. ఇప్పుడు వినియోగదారులకు ఆ సమాచారం కూడా మెసేజ్ రూపంలో పంపుతున్నారు. మీరు ఫలానా తేదీ తరువాతే గ్యాస్ బుక్ చేసుకోవాలని స్పష్టంగా చెబుతున్నారు.

**జేసీని కలిసిన హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు**

వాణిజ్య సిలిండర్ల సరఫరా ఆగిపోవడంతో, తమ వ్యాపారాలు మూతపడతాయని, సుమారు రెండు లక్షల మంది ఉపాధి కోల్పోతారని, తక్షణమే గ్యాస్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నం హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరిని కలిశారు.

డిమాండ్ మేరకు కాకపోయినా సగమైనా ఇవ్వాలని, లేదంటే వ్యాపారాలు ఆగిపోవడంతో పాటు, ప్రజలు, పర్యాటకులు కూడా ఇబ్బందిపడే పరిస్థితి వస్తుందని అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణ తెలిపారు.

**ఆస్పత్రులు, హాస్టళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు**

ఆస్పత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు ఇప్పటివరకు వాణిజ్య సిలిండర్లనే అందించేవారు. ఇప్పుడు అవి అందుబాటులో లేకపోవడం, ఆయా సంస్థలు ముఖ్యమైనవి కావడంతో వాటికి డొమెస్టిక్ సిలిండర్లు ఇవ్వాలని పైనుంచి ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు.

# తిరుపతిలో వైసీపీ ఆవిర్భావ వేడుకలు



**తిరుపతి, మార్చి 12 (నేటి మనదేశమ్) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా తిరుపతిలోని మారుతినగర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 15 ఏళ్లుగా, అధికారం ఉన్నా లేకున్నా, ప్రజల పక్షంలో పోరాటం కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ప్రత్యర్థులు చెప్పిన అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని తెలిపారు.

బ్యాంకుల్లో ఒక్క మహిళ కని పించదు, వ్యాపారస్తులు దుకాణాలు మూసుకుం టున్నారని ఆగ్రహించారు. కేంద్రం ఇచ్చిన అప్పులన్నీ ఏమై పోతున్నాయో తెలియదని, పోలవరం అభివృద్ధి లేదని, రాయలసీమ అభివృద్ధి లేదని పేర్కొన్నారు. పెట్టుబడులు అన్ని అమరావతిలోనే పెట్టబడుతున్నా యన్నారు. 1978 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా ఇంత దారుణమైన ప్రభుత్వం ఎప్పుడూ చూడలేదన్నారు.

# ఎన్నికలెప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి



**వినుకొండ, మార్చి 12 (నేటి మనదేశమ్) :** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఎమ్మెల్యేలు పనితీరును మరింత మెరుగుపరుచుకుని ప్రజల మన్ననలు పొందాలని పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీకి సిఎం చంద్రబాబు సూచించారు. పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ కృతికా శుక్ల, ఎస్పీ బి.కృష్ణారావుతో సిఎం బుధవారం సమీక్షించారు. శాంతి భద్రతలు పరిరక్షణ, జిల్లా సమగ్రా భివృద్ధి, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం సమీక్షించారు. జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయు క్తంగా పనిచేయాలని, ప్రజ లకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు.

# చిత్తూరులో అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



**చిత్తూరు, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ఆంధ్ర ప్రదేశ్‌లోని చిత్తూరులో ఇంటి దొంగ తనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముద్దాయి లను చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి సుమారు రూ.34 లక్షల విలు వైన 151 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.6 కిలోల వెండి వస్తువులు మరియు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఫిబ్రవరి 5న దుర్గా నగర్ కాలనీలో నివసించే వరదరాజులు ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లిన సమయంలో నిందితులు లల్లూ ప్రసాద్ (ఎ1), జనార్ధన్ (ఎ2) ఇంటి తలుపు పగలగొట్టి బంగారం, వెండి దొంగిలించారు. బాధితుడు ఫిబ్రవరి 6న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు మార్చి 11న చిత్తూరు-గుడిపాల రహదారిలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల విచారణలో ఎ1 లల్లూ ప్రసాద్‌పై కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 31 కేసులు ఉన్నట్లు తెలిసింది. ఎ2 జనార్ధన్‌పై ద్విచక్ర వాహనాల దొంగతనం మరియు గంజాయి అక్రమ రవాణా సంబంధిత 7 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను...

కోర్టులో హాజరుపరచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# గంజాయితో ముగ్గురి అరెస్టు



**ఎచ్చెర్ల, మార్చి 12 (నేటి మనదేశమ్) :** పొన్నాడ పంచాయతీ వెంకన్నగారి పేట సమీపంలో గంజా యితో ముగ్గురు యువకులను బుధవారం అరెస్టు చేయగా, మరో వ్యక్తి పరారైనట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలి పారు. సీఐ తెలిపిన వివ రాల మేరకు.. శ్రీకాకుళం నగరం పాత శ్రీకాకుళాని కి చెందిన గంటల సూర్యతేజ, దమ్మల వీధికి చెందిన కేశవ బాలు, సోపేటి కార్తీక్, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం పిట్టగూడకు చెందిన బురి డి లైకోన్ గంజాయి తాగుతున్నారు. వీరివద్ద గంజాయి ఉందన్న ముందస్తు స మాచారంతో ఎస్‌ఐ, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి పట్టుకునేందుకు ప్రయత్నించగా.. కార్తీక్ తప్పించుకుని పారిపోగా మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తరచూ ఈ ప్రాంతానికి వచ్చి మద్యం, గంజాయిని తీసు కుంటున్నట్టు విచారణలో తేలింది. వీరి నుంచి ద్విచక్ర వాహనంతోపాటు 2.3 కి లోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి బురిడి లైకోన్ గంజా యిని తీసుకువచ్చి ఇక్కడ కిలో రూ.3వేలకు విక్రయిస్తున్నట్టు విచారణలో గుర్తిం చారు. గంజాయి సేవిం చినా, రవాణాకు పాల్పడినా, విక్రయించినా నేరమన్నారు. అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని, చట్టపరంగా రౌడీషీట్లు తెరుస్తా మని హెచ్చరించారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ జి.లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

# పౌర సేవల్లో పల్నాడుకు 2వ స్థానం



**పల్నాడు జిల్లా, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ప్రజలకు పౌర సేవలు అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం పల్నాడు జిల్లాకు రెండవ స్థానం లభించిందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ప్రధానంగా అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఆర్టీసీ బస్సు ప్రయాణ వసతి, రైతులకు విత్తనాల పంపిణీ, వైద్య సేవలు, మహిళలపై నేరాల నివారణ తదితర 39 రకాల సేవలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా మెరుగ్గా పనిచేసిందన్నారు. ప్రజల సంతృప్త స్థాయి డిసెంబరులో 68.1 శాతం ఉండగా 5.4 శాతం వృద్ధితో 73.50 శాతానికి పెరిగిందన్నారు.

# వరల్డ్ పారా అథ్లెటిక్స్ లో కాంస్యంతో మెరిసిన గౌతమ్



**విజయనగరం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** న్యూ ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా మార్చి 8 నుండి 13 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ -2026 పోటీలలో భారతదేశం తరపున పాల్గొన్న విజయనగరం జిల్లాకు చెందిన పారా అథ్లెట్ కరణం గౌతమ్ (ఎ-12 కేటగిరి ) 100 మీటర్లు పరుగులో కాంస్య పతకం సాధించారు. ఇది అంతర్జాతీయ వేదిక మీద జిల్లాకు దక్కిన గౌరవమని జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవధ్యక్షులు కె.దయానంద్ ఆనందం వ్యక్తం చేసారు. వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీలకు భారత్ నుండి ఆరుగురు (6) పారా క్రీడాకారులు ఎంపిక కాగా అందులో విజయనగరం జిల్లాకు చెందిన కరణం గౌతమ్ ఒకరని తెలిపారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి కాంస్యం గెలుచుకున్న గౌతమ్ అంతర్జాతీయ వేదికపై జిల్లా కీర్తిని మరింతగా పెంచాడని అన్నారు. ఇదే స్ఫూర్తి తో భవిష్యత్ లో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.

# పోలీస్ స్టేషన్లకు పదో తరగతి ప్రశ్నపత్రాలు



**రామచంద్రపురం, మార్చి 12 (నేటి మనదేశమ్) :** కె.గంగవరం మండలానికి సంబంధించిన పదో తరగతి ప్రశ్నాపత్రాలను ఎంఇఒ ఆంజ నేయులు, చీఫ్ సూపరింటెం డెంట్ ఖాజా మొహిద్దీన్, కస్టోడియన్లు సుబ్రహ్మణ్యం, అరుగుల శ్రీనివాసరావు సమక్షంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సోమేంద్ర ప్రశ్నాపత్రాలను స్టేషన్‌లో భద్ర పర్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల వద్దకు అనుమతి లేని వ్యక్తులు చేరకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని అన్నారు.

# ప్రత్తిపాడు మండలంలో పెద్దపులి ప్రత్యక్షం

**ప్రత్తిపాడు, మార్చి 12 (నేటి మనదేశమ్) :** ప్రత్తిపాడు కొంతకాలంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం, ఏలేశ్వరం మండలం ఏలేరు పరీవాహక ప్రాంతంలో సంచరిస్తున్న పులి బుధవారం నాటికి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోకి ప్రవేశించిందని ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారులు తెలిపారు. ప్రత్తిపాడు మండలం దారపల్లి అటవీ ప్రాంతం పరిసరాల్లో అటవీ అధికారులు పెద్దపులిని గుర్తించారు. అది ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో సంచరిస్తుందా, లేదా అనకాపల్లి జిల్లా వైపు వెళు తుందా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. పులి కదలికలపై శాటిలైట్ ట్యాగ్ ద్వారా అటవీ నిపుణుల బృందాలు నిఘా పెట్టాయి. ప్రత్తిపాడు మండలంలోకి పులి ప్రవేశించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ తెలిపారు.


# కష్టాల నాయకుడికి 'ప్రైమ్' షాకు ?






రాజకీయాలంటే అంతే. అడుగుపెట్టాక చాలా బురదను కడుక్కోవాల్సి ఉంటుంది. కొందరు తట్టుకుంటారు. కొందరు వదిలేస్తారు. చిరంజీవి ప్రజారాజ్యం విషయంలో ఎక్కడైతే విఫలమయ్యారో పవన్ కళ్యాణ్ అక్కడే జనసేన రూపంలో పోరాటం చేసి డిప్యూటీ సిఎం దాక వచ్చారు. పక్క రాష్ట్రంలో రజనీకాంత్, కమల్ హాసన్ తమ వల్ల కాదని తిరిగి సినిమాల్లోకి వస్తే, ఎంజిఆర్ లాంటి లెజెండరీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేకపోయారు. తాజాగా తన పొలిటికల్ ప్రస్థానాన్ని ఘనంగా ఆరంభించాలని చూస్తున్న విజయ్ కు ఎన్నో అడ్డంకులు తలెత్తుతున్నాయి. రోడ్ షోలో అభిమానులు చనిపోవడం, దాని మీద ఢిల్లీలో విచారణ, భార్య సంగీత విడాకుల వ్యవహారం, త్రిషతో ప్రేమాయణం పుకార్లు ఇలా రకరకాల వ్యూహ్యాల్లో చిక్కుకున్నాడు. వీటికన్నా ముందు సంక్రాంతి నుంచి వాయిదా పడుతున్న జన నాయకుడు విడుదల గురించి స్పష్టత లేక ఫ్యాన్స్ అసహనానికి గురవుతున్నారు. చెన్నై టాక్ ప్రకారం జన నాయకుడు విడుదలలో విపరీతమైన జాప్యం జరిగిన కారణంగా అమెజాన్ ప్రైమ్ ఓటిటి డీల్ రద్దు చేసుకుందట. అధికారికంగా ఇంకా బయటికి చెప్పలేదు కానీ న్యూస్ అయితే జోరుగా చక్కర్లు కొడుతోంది. ఇస్తామన్న నూటా ఇరవై కోట్ల ఒప్పందం ఈ ఆలస్యం వల్ల నిర్మాత చేజారిపోయినట్టు వినికిడి. థియేటర్ రిలీజ్ డేట్ కు అనుగుణంగానే ఓటిటి అగ్రిమెంట్లు రాసుకుంటాయి. అది పదే పదే మిస్ అయితే క్యాన్సిల్ చేసుకునే హక్కు కూడా ఉంటుంది. గతంలో హరిహర వీరమల్లు విషయంలోనూ ఇదే సమస్య తలెత్తితే ఏదోలా నిర్మాత ఏఎం రత్నం మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. చివరికి భారీ కోత విధించాక ఈ సినిమాని ప్రైమ్ కొందనే వార్త చక్కర్లు కొట్టింది. మరి జన నాయకుడుకి అలాంటి వెసులుబాటు ఇస్తారో లేదో చూడాలి. అయితే జన నాయకుడు విడుదలై బ్లాక్ బస్టర్ అయితే తర్వాతైనా కొనేందుకు ఓటిటిలు ముందుకు వస్తాయి. కొంచెం సొమ్ము తగ్గుతుంది అంతే. వీలైనంత త్వరగా నిర్మాణ సంస్థ కెవిఎన్ ఈ ప్రచారాలకు చెక్ పెట్టడం బెటర్.

# పవన్ ఫ్యాన్స్ బాధ అర్థం చేసుకున్నారు



అభిమానులందు పవన్ అభిమానులు వేరయా అంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు. ఆయనకున్న లాయల్ ఫ్యాన్ బేస్ ఇండియా మొత్తంలో చాలా కొద్దిమందికే ఉంటుంది. అన్ కండిషనల్ లవ్, సపోర్ట్ అన్న మాటలకు అర్థం పవన్ ఫ్యాన్స్ అని చెప్పొచ్చు. పవన్ తమకు నచ్చని సినిమా చేస్తే.. అది మేకింగ్‌లో ఉన్నంత కాలం ఎంత వ్యతిరేకించినా సరే.. బొమ్మ థియేటర్లలోకి వచ్చిందంటే కళ్లు మూసుకుని పవన్ దర్శనం కోసం వెళ్లిపోతారు. రీమేక్‌లు కావడం వల్ల కావచ్చు.. హీరో ఎలివేషన్లు ఆశించినంత ఉండకపోవచ్చన్న అంచనాల వల్ల కావచ్చు.. గోపాల గోపాల, కాటమరాయుడు, వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో.. ఇలా చాలా సినిమాల విషయంలో పవన్ ఫ్యాన్స్ వ్యతిరేకతను ప్రదర్శించారు. కానీ ఆ చిత్రాలన్నింటికీ మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. విడుదల ముంగిట ఏమాత్రం ఆశలు లేని 'హరిహర వీరమల్లు' విషయంలోనూ ఇదే జరిగింది. పవన్ సినిమాల గురించి ముందు ఏమన్నా సరే.. రిలీజ్ టైంకి అన్నీ పక్కన పెట్టి థియేటర్లకు పరుగులు పెట్టేస్తారు అభిమానులు. ఐతే పవన్ అభిమానుల ఉత్సాహాన్ని నిర్మాతలు క్యాష్ చేసుకుంటున్నారనే విమర్శ ఎప్పట్నుంచో ఉంది. పవన్ సినిమాలకు పెయిడ్ ప్రిమియర్స్, బెనిఫిట్ షోలు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు రూ.800-1000 మధ్య రేటు పెడుతున్నారు. ఈ రేట్లు మరీ ఎక్కువ అని అసంతృప్తి వ్యక్తం చేస్తూనే అభిమానులు టికెట్లు కొంటూ వస్తున్నారు. అభిమానులను దోచేసుకుంటున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు వస్తున్నాయి. పవన్ రాజకీయ ప్రత్యర్థులు కూడా ఈ విషయాన్ని హైలైట్ చేస్తూ వస్తున్నారు. ఐతే పవన్ కొత్త సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్' విషయంలో మాత్రం నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆచితూచి అడుగు వేసింది. ఏపీలో ప్రిమియర్స్‌కు ఎంత రేటు అడిగితే అంత ఇచ్చే పరిస్థితి ఉన్నా.. ఈ షోలకు రూ.500 రేటే అడిగారు. జీవో రావడం లాంఛనమే. బెనిఫిట్ షోలకు ఇది రీజనబుల్ రేటు అనడంలో సందేహం లేదు. అభిమానులు చాలా సంతోషంగా ఈ రేటు పెట్టి సినిమా చూస్తారు. తెలంగాణలో రేట్ల పెంపుకి ఛాన్సే ఉన్నట్లు కనిపించడం లేదు. నార్మల్ రేట్లతోనే బెనిఫిట్ షోలు వేస్తే ఆశ్చర్యం లేదు. రెగ్యులర్ షోలకు కూడా అవే రేట్లు కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ఇది అభిమానులతో పాటు ప్రేక్షకులందరికీ ఉత్సాహాన్నిచ్చే విషయమే. దీని వల్ల ఫుట్ ఫాల్స్ పెరిగి అంతిమంగా నిర్మాతలకు కూడా మేలే జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మార్కెటింగ్ అవసరం లేని కొత్త పాఠం



వందల కోట్లతో ప్యాన్ ఇండియా మూవీస్ తీస్తున్నప్పుడు పెద్ద ఎత్తున ప్రమోషన్లు అవసరం. ఎవరికైనా ఇది తప్పదు. ఎప్పుడో 2027 ఏప్రిల్ లో వచ్చే వారణాసి కోసం రాజమౌళి ఇప్పటి నుంచే విదేశీ మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. టైటిల్ లాంచ్ కోసమే కోట్లు ఖర్చు పెట్టి హైదరాబాద్ లో ఈవెంట్ చేశారు. నెలకోసారి ఏదో రూపంలో ట్రెండింగ్ అయ్యే కంటెంట్ ఇస్తున్నాడు. ఇదంతా గ్లోబల్ అటెన్షన్ కోసమే. బడ్జెట్ తో సంబంధం లేకుండా ప్రతి సినిమాకు ఇది ఫాలో కావాల్సిందే. కానీ దురంధర్ ది రివెంజ్ కొత్త గ్రామర్ నేర్పిస్తోంది. ఇది వరకు బాలీవుడ్ మేకర్స్ చదవని మార్కెటింగ్ పాఠాన్ని చదువుకోమంటోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా నిర్మాత సంస్థ జియో స్టూడియోస్, నిర్మాత కం దర్శకుడు ఆదిత్య ధార్ ఎలాంటి పబ్లిసిటీ చేయడం లేదు. ఇంటర్వ్యూలు ఇవ్వడం, కపిల్ శర్మ లాంటి కామెడీ షోలలో పాల్గొని స్కిట్లు చేయడం లాంటి వాటికి దూరం ఉంటున్నారు. రణ్వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ లాంటి పెద్ద క్యాస్టింగ్ ఉన్నప్పటికీ ఎవరూ మీడియా కెమెరా ముందుకు రావడానికి ఇష్టపడటం లేదు. ఇంత లో ప్రొఫైల్ మెయింటైన్ చేస్తున్నా బుకింగ్స్ మాత్రం అదిరిపోతున్నాయి. ఇప్పటికే 50 కోట్లు వసూలైపోగా రోజుకు బుక్ మై షోలో కనిష్టంగా 30 వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోతున్నాయి. దురంధర్ మొదటి భాగం ప్రభావం ఏ స్థాయిలో ఉందంటే రేపటి నుంచి ఇండియా వైడ్ అయిదు రోజుల పాటు మరోసారి దీన్ని స్క్రీనింగ్ చేస్తున్నారు. హిందీలోనే ఇలా ఉంటే ఇక తెలుగు తమిళ ప్రమోషన్లు ఏం పట్టించుకుంటారు. అయినా సరే హైదరాబాద్ లో ఆల్ టైం రికార్డు నమోదయ్యేలా ఉంది. ఏపీ మెయిన్ సెంటర్స్ లో సాయంత్రం షోలు దాదాపు ఫుల్ అయ్యాయి. రాత్రికి పాజిటివ్ టాక్ వస్తే నెక్స్ట్ డే నుంచి ఉస్తాద్ భగత్ సింగ్ ఉన్నా సరే వసూళ్ల మోత ఖాయం. ఇక్కడ గమనించాల్సిన పాయింట్ ఒకటుంది. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే ఎలాంటి గిమ్మిక్కులు చేయకపోయినా జనం ఆటోమేటిక్ గా సినిమా చూస్తారు. కానీ అన్ని సినిమాలకు ఇదే సూత్రం వర్తించదు. ఎలా చూసుకున్నా దురంధర్ ఆస్కార్ మెట్లు ఎక్కలేదు. ఎక్కే ఛాన్స్ లేదు. కానీ వారణాసి లాంటివి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్కోప్ ఉన్నవి. అందుకే జక్కన్న అంతగా కష్టపడతారు. దురంధర్ కు అంత శ్రమ అవసరం లేదు కాబట్టి రిలాక్స్ అవుతుంది.



# బిజినెస్ న్యూస్




## అశోక్ లేలాండ్ రూ.500 కోట్ల పెట్టుబడి: ఎందుకంటే?



వాణిజ్య వాహన తయారీ హిందుజా గ్రూప్ దిగ్గజం అశోక్ లేలాండ్ తాజాగా గ్రీన్‌ఫీల్డ్ బ్యాటరీ ప్యాక్ తయారీపై దృష్టి పెట్టింది. ఇందుకు చెన్నై సమీపంలో తయారీ యూనిట్ నెలకొల్పేందుకు రూ. 500 కోట్లవరకూ ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. వెరసి కొత్త బ్యాటరీ ప్యాక్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు వీలుగా పిళ్లైపక్కం(చెన్నై)లో భూమి పూజ నిర్వహించినట్లు పేర్కొంది. ఈ ప్రాజెక్టుపై రూ. 400--500 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. ఇందుకు 2025 సెప్టెంబర్‌లోనే హిందుజా గ్రూప్ పెట్టుబడులలో భాగంగా అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రయాణంలో ఇది కీలక ముందడుగుగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ధీరజ్ హిందుజా పేర్కొన్నారు. అంతేకాకుండా దేశీయంగా పటిష్ట ఈవీ ఎకోసిస్టమ్ ఏర్పాటులో తమ కట్టుబాటుకు మరింత మద్దతివ్వనున్నట్లు వివరించారు. తద్వారా దేశీయంగా ఈవీ బ్యాటరీ ప్యాక్ ఉత్పత్తికి వీలు కల్పించనున్నట్లు తెలియజేశారు.

## పెరగనున్న ఆడి కార్ల ధరలు: ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి



జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి.. భారతదేశంలో తన ఉత్పత్తుల ధరలను 2 శాతం వరకు పెంచనున్నట్లు తెలిపింది. ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, కరెన్సీ హెచ్చుతగ్గుల కారణంగా 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. ఏ మోడల్ ధర ఎంత అనేది త్వరలోనే తెలుస్తుంది. ధరల అప్డేట్ గురించి ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ.. ధరల పెరుగుదల ప్రభావాన్ని మా కస్టమర్లపై తగ్గించడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని అన్నారు. ధరల పెరుగుదల భారతదేశంలో ఆడి యొక్క పూర్తి లైనప్‌ను ప్రభావితం చేస్తుంది, ఇందులో ఆడిQ4,Q5,Q6,Q3,Q3 స్పోర్ట్‌బ్యాక్,Q5, Q7, Q8 & RSQ8 పెర్ఫార్మెన్స్ వంటి మోడళ్లు ఉన్నాయి. 2026 జనవరి నెలలో దేశీయ వాహన తయారీ సంస్థలు మాత్రమే కాకుండా.. బిఎండబ్ల్యు, మెర్సిడెస్ బెంజ్ కంపెనీలు కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచినట్లు అధికారికంగా వెల్లడించాయి. ఇప్పుడు అదే బాటలో ఆడి ఇండియా కూడా అడుగులు వేసింది.

## వాట్సప్, ఫేస్‌బుక్‌లో యాంటీ స్కామ్ టూల్స్.. ఎలా పనిచేస్తాయంటే?



వాట్సప్, ఫేస్‌బుక్ వేదికగా జరిగే మోసాలకు చెక్ పెట్టేందుకు మెటా సిద్ధమైంది. సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను రక్షించేందుకు కొత్తగా యాంటీ స్కామ్ టూల్స్‌ను ప్రవేశపెట్టింది. వాట్సప్, ఫేస్‌బుక్, మెసెంజర్ యాప్‌లలో ఆయా టూల్స్ పనిచేస్తాయి. ఇవి మోసాలను గుర్తించడంతో పాటు కేటుగాళ్ల బారిన పడకుండా యూజర్లను నిలువరించడంలో సాయపడతాయి. వాట్సప్ వేదికగా నిత్యం సైబర్ మోసాలు జరుగుతుంటాయి. ఇందులో డివైజ్ లింకింగ్ ఫీచర్ ఉపయోగించేవి చేసేవే అధికం. వాట్సప్ యూజర్ల సౌలభ్యం కోసం తీసుకొచ్చిన ఈ ఫీచర్ ద్వారా కేటుగాళ్లు సదరు వ్యక్తి అకౌంట్‌ను తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. వారి వ్యక్తిగత సందేశాలు చదవడంతో పాటు, వారి పేరిట డబ్బులు అడగడం, గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్‌ను పోస్ట్ చేయడం వంటివి చేస్తుంటారు. ఇలా లింక్ డివైజ్ ఫీచర్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వాట్సప్ కొత్త సదుపాయం తీసుకొచ్చింది. ఎవరైనా లింక్ డివైజ్‌ను అనధికారికంగా వాడుదామని ప్రయత్నిస్తే.. చివరి నిమిషంలో 'బహుశా ఇది స్కామ్ అయ్యుండొచ్చు' అంటూ ఒక అలర్ట్ చేయడంతో పాటు 'డోంట్' లింక్ అనే ఆప్షన్ క్లిక్ చేసి బయటకు వచ్చేసే అవకాశాన్ని మెటా కల్పిస్తోంది. కొన్నిసార్లు ఫేస్‌బుక్ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్న వ్యక్తుల నుంచే మళ్లీ కొత్తగా ఫ్రెండ్ రిక్వెస్టులు వస్తుంటాయి. ఇంకో ఖాతా అయ్యుంటుందిలే అని యాక్సెప్ట్ చేసే వారే ఎక్కువ. ఇది వరకే కొందరు మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండడం వల్ల ఎక్కువ మంది నమ్మి ఓకే చేస్తుంటారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఖాతా నుంచి మెసేజులు పెడుతూ అత్యవసరం పేరిట డబ్బులు అడగడం వంటివి చేస్తుంటారు. ఈ తరహా మోసాలకు చెక్ పెట్టేందుకు మెటా కొత్త ఏఐ టూల్‌ను తీసుకొచ్చింది. ఏదైనా అనుమానిత ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే.. వారి లొకేషన్, మ్యూచువల్ కాంటాక్టులు, ఫేస్‌బుక్‌లో చేరి ఎన్ని రోజులైంది? వంటి వివరాలు చూపించి అలర్ట్ చేస్తుంది. ఫేస్‌బుక్ మెసెంజర్‌లో కూడా కొత్త ఖాతా నుంచి వచ్చే సందేశాల పట్ల యూజర్లను అప్రమత్తం చేస్తుంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




గురువారం ఉదయం నష్టాల్లో మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 829.29 పాయింట్ల నష్టంతో 76,034.42 వద్ద, నిఫ్టీ 227.70 పాయింట్ల నష్టంతో 23,639.15 వద్ద నిలిచాయి. ఐసీడీఎస్ లిమిటెడ్, రీగాల్ రిసోర్సెస్ లిమిటెడ్, డీసీఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్, ఉషా మార్టిన్ ఎడ్యుకేషన్ ః సొల్యూషన్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ప్రజయ్ ఇంజనీర్స్ సిండికేట్ లిమిటెడ్, క్రియేటివ్ ఐ లిమిటెడ్, అవాన్మోర్ క్యాపిటల్ ః మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్, అక్యూస్ లిమిటెడ్, కేంబ్రిడ్జ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

## యుద్ధం ముగిస్తాం కానీ..

# మూడు షరతులు పెట్టిన ఇరాన్




అమెరికా, ఇజ్రాయెల్‌తో చేస్తోన్న యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ ముందుకువచ్చింది. కానీ మూడు షరతులు విధించింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ఎక్స్‌లో పోస్టు చేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతికి ఇరాన్ కట్టుబడి ఉంది. రష్యా, పాకిస్థాన్ నాయకులతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించాను. అమెరికా రగిల్చిన యుద్ధాన్ని ముగించేందుకు మా మూడు షరతులను అంగీకరించాలి. ఇరాన్ చట్టబద్ధ హక్కుల్ని గుర్తించాలి. నష్టపరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో దురాక్రమణలు జరగకుండా పటిష్ఠమైన అంతర్జాతీయ హామీలు ఉండాలి" అని అధ్యక్షుడు ఎక్స్‌లో రాసుకొచ్చారు.

**ఇరాన్ వార్నింగ్... :** ఒక బ్యారెల్‌కు 200 డాలర్ల చొప్పున చెల్లించేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని గురువారం ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. 1970 తర్వాత చమురు షాక్‌ను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక నిల్వలను విడుదల చేయాలని అంతర్జాతీయ ఇంధన సంస్థ సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా హెచ్చరిక వచ్చింది. మరోవైపు హర్మూజ్‌లో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య దాడులు జరుగుతున్నాయి.

ఈ ప్రాంతంలోకి అమెరికా మిత్ర దేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా ఇరాన్ ఎక్కడికక్కడ 'నేవల్ మైన్స్' (సముద్రపు మందుపాతరలు) అమర్చడం ఆందోళన కలిగిస్తోంది.

## 200మందికి పైగా చిన్నారుల మృతి



జెనీవా : పశ్చిమాసియాలో పెరుగుతున్న వివాదం తీవ్ర మానవతా సంక్షోభానికి దారితీస్తుందని ఐక్యరాజ్యసమితికి చెందిన పిల్లల సంస్థ 'యునిసెఫ్' హెచ్చరించింది. ఫిబ్రవరి చివరలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 1,100 కంటే ఎక్కువ మంది చిన్నారులు మరణించారు లేదా గాయపడినట్లు బుధవారం వెల్లడించిన ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 28 నుండి అమెరికా–ఇజ్రాయిల్‌లు ఇరాన్‌పై విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. తీవ్రమవుతున్న హింస ఈ ప్రాంతంలో అనేక దేశాల్లోని మైనర్లపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతోందని యునిసెఫ్ ఆ ప్రకటనలో పేర్కొంది. మానవతా సంస్థలు మరియు స్థానిక అధికారుల చేపట్టిన అధ్యయనం ప్రకారం.. ఇరాన్‌లో సుమారు 200 మంది చిన్నారులు, లెబనాన్‌లో 91మంది, ఇజ్రాయిల్‌లో నలుగురు, కువైట్‌లో ఒకరు మరణించారు.వందలాది మంది గాయపడినట్లు తెలుస్తోంది. శతృత్వం పెరుగుతుండటం, యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని యునిసెఫ్ హెచ్చరించింది. మరణాలు మరియు గాయాల సంఖ్యతో పాటు, యువతపై యుద్ధం పరిణామాలను యునిసెఫ్ స్పష్టం చేసింది. వైమానిక దాడులు మరియు భద్రతా సమస్యల కారణంగా పాఠశాలలు మూసి వేయడంతో లక్షలాది మంది పిల్లలు తరగతి గదులను వీడాల్సి వచ్చింది. నిరంతర బాంబు దాడులతో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపింది. ఆస్పత్రులు, నీటి సరఫరా సహా కీలకమైన సేవలపై తీవ్ర ప్రభావం పడిందని, ఇది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని పేర్కొంది. అనేక కుటుంబాలు వైద్య సంరక్షణ, సురక్షితమైన ఆశ్రయం, ప్రాథమిక అవసరాలను సైతం పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయుధ పోరాటాలను చిన్నారులు ఎప్పటికీ ఎదుర్కోకూడదని యునిసెఫ్ ఆవేదన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మానవతా చట్టాలను గౌరవించాలని అన్ని దేశాలకు విజ్ఞప్తి చేసింది. పౌరులను రక్షించడానికి మరియు ప్రభావితమైన వారికి మానవతా సాయం అందేలా చేయడానికి ప్రభుత్వాలు, అంతర్జాతీయ సమాజం తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చింది. "ఈ ప్రాంతంలోని సుమారు 200 మిలియన్ల మంది చిన్నారులు అంతర్జాతీయ సమాజం త్వరగా చర్యలు తీసుకోవాలని ఎదురు చూస్తున్నారు" అని యునిసెఫ్ ప్రకటించింది.

## గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు ఆపేయాలి

### ఐరాసలో తీర్మానం



పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ భీకర స్థాయిలో దాడులు చేస్తున్నాయి. ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఇప్పటికైనా టెహ్రాన్ ఈ దాడులను ఆపేయాలని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భారత్ కో స్పాన్సర్‌గా తీసుకొచ్చిన ఈ తీర్మానానికి ఆమోదం లభించింది.

బహ్రెయిన్ తీసుకొచ్చిన ఈ తీర్మానంలో 130 దేశాలు కో స్పాన్సర్లుగా ఉన్నాయి. అందులో భారత్ కూడా ఒకటి. ఇరాన్ దాడులు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ యుద్ధం ప్రపంచ శాంతిభద్రతలకు తీవ్ర ముప్పును కలిగిస్తోందని ఆరోపించారు. 'బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్‌లపై ఇరాన్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలి' అంటూ ప్రవేశపెట్టిన తీర్మానానికి వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయలేదు. భద్రతామండలిలో మొత్తం 15 సభ్యదేశాలు ఉండగా..

13 ఓట్లతో దీనికి ఆమోదం లభించింది. ఈ ఓటింగ్ ప్రక్రియకు ఇరాన్ మిత్రదేశాలైన చైనా, రష్యాలు దూరంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ చర్యలను కూడా ఐరాస భద్రతా మండలి ఖండించింది. అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబంలోని వారితో సహా పలువురు కీలక అధికారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.తాజాగా ప్రవేశపెట్టిన తీర్మానంలో ఐరాస భద్రతా మండలి ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని రష్యా, చైనాలు విమర్శించాయి.

## సాక్షి స్క్రిప్ట్ చదివి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం

### జగన్ అబద్ధాలను ప్రజలు నమ్మరు : రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్




**అనంతగిరి, మార్చి 12 (నేటి మనదేశమ్) (అల్లూరి సీతారామరాజు జిల్లా) :** అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు రాకుండా దాగుడుమూతల ఆట ఆడిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు సొంత మీడియా ముందు సాక్షి స్క్రిప్ట్ చదివి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం వరకే అసెంబ్లీలో ఉండి బయటకు వెళ్లడం ద్వారా ప్రజలను మోసం చేశారని అన్నారు. కాగ్ నివేదికలో జగన్ ప్రభుత్వం చేసిన భారీ అప్పులు బయటపడినా వాటిని వక్రీకరించి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలపై దాదాపు 45 శాతం ఎక్కువ ఖర్చు చేస్తోందన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరాయని, వేల కోట్ల పెండింగ్ బిల్లులు వదిలి వెళ్లిన ఆయన ఇప్పుడు రాష్ట్ర ఖజానా గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు.ఈ సందర్భంగా పాడేరు కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు, దారేలా సర్పంచ్ పాండు రంగ స్వామి, శోభకోట సర్పంచ్ శశిభూషణ్ నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శులు సుబ్బారావు, మాజీ క్లస్టర్ ఇంచార్జి నిర్మల, టీడీపీ నాయకులు భూషణరావు, అచ్చిబాబు, కామేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రామిస్ లాండ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

## గిరిజన విద్యార్థులకు నిత్యావసర సరకులు పంపిణీ

**ముఖ్య అతిథిగా అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు**






**అనంతగిరి, నేటి మనదేశమ్, మార్చి 12 :** అనంతగిరి స్థానిక ప్రామిస్‌థ లాండ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అనంతగిరి మండలములో గల అనంతగిరి, కాశీపట్నం, మరియు గ్రామ పంచాయతీల పరిధిలో గల పల్లంవలస, సారవాని పాలెం , సీతంపేట , అనంతగిరి లక్ష్మీపురం, భారజోల , గ్రామాలలో గల పాఠశాల విద్యార్థులకు నిత్యావసరల సరకులు బిర్యాని బెల్ రైస్ ఐదు కేజీ లు, రిఫండ్ అయిల్ కేజీ, కారంపేకాట్, ఉప్పు ప్యాకెట్, టీ పౌడర్ ప్యాకాట్,నిత్యావసరల సరుకులు సామాగ్రి సుమారు 180 మంది పేద పిల్లలకు అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు చేతులు మీదుగా ఉచితంగా పంపిణీ చేయుట జరిగింది. కార్యక్రమం లో పాల్గొన్న ప్రామిస్ లాండ్ సంస్థ అధ్యక్షురాలు అయిన దీసరి దేముడమ్మ, మరియు సంస్థ ట్రెజరర్ అయిన కుమార్ ఈ కార్యక్రమం ముఖ్యతిదిగా పాల్గొన్న జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ సంస్థ దాతల నుండి మరియు సంస్థ ప్రామిస్ లాండ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్, జన్ పిటర్ మెమోరియల్ ఫౌండేషన్, ప్రామిస్ లాండ్ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్,సభ్యుల సహకారంతో విద్యార్థులలో విద్య పై శ్రద్ధ కనబరిచే విధంగా పైన తెలిపిన సామాగ్రి పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని అని అన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమం లో విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత మరియు ప్రభుత్వ పాఠశాలలో లభించు పౌష్టికాహారం, అదేవిధంగా ఇంటివద్ద లభించే పదార్థములతో సులభంగా పౌష్టికాహారం ఎలా తయారుచేసుకొని తీసుకోవాలి అని మరియు సీజనల్ గా వచ్చే అనారోగ్య సమస్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు వ్యక్తి గత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత ముఖ్యంగా త్రాగునీరు మరగ కాచి త్రాగాలని సంస్థ సిబ్బంది పిల్లలకు అవగాహన కల్పించుట జరిగింది ఈ కార్యక్రమం లో సంస్థ ప్రోగ్రాం ఇన్చార్జి అయిన దీసరి బుద్ధ రాజు మరియు సంస్థ సిబ్బంది సాయి, సామ్యూల్ పాస్టర్, జన్ని సింహద్రి , అప్పలరాజు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోళ్ల

- 28 మంది లబ్ధిదారులకు సుమారు19 లక్షల రూపాయల చెక్కులను అందించిన ఎమ్మెల్యే కోళ్ల
- ఇది ప్రజా పక్షపాతి ప్రభుత్వం అన్న ఎమ్మెల్యే కోళ్ల




**కొత్తవలస నేటి మన దేశమ్ ప్రతినిధి :** శృంగవరపుకోట నియోజకవర్గం ఎల్ కోట మండల కేంద్రంలో గల టిడిపి క్యాప్ కార్యాలయంలో గురువారం ఉదయం సుమారు 28 మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకు 19 లక్షల రూపాయల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండడానికి సీఎం సహాయనిది ఎంతగానో ఉపయోగపడుతుందని నేడు 28 మంది లబ్ధిదారులకు సుమారు 19 లక్షల రూపాయలు ఇవ్వటం జరిగిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలోనే నియోజకవర్గ మొత్తంగా 348 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా రెండు కోట్ల 99 లక్షల రూపాయల వరకు ఆర్థిక భరోసా కల్పించామని లబ్ధిదారులకు మా చేతుల మీదగా చెక్కులను అందించడం మాకెంతో సంతృప్తిని ఇచ్చిందని నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందే వరకు మా కృషి నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటూ, వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ అసలైన విజయం. అని అన్నారుఈ కార్యక్రమంలో ఐదు మండలాల కూటమి నాయకులతొ పాటు కార్యకర్తలు లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికాను భయపెడుతున్న ఇరాన్ 'దోమల దండు'..!



ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్‌పై ఉక్కు పిడికిలి బిగించేందుకు ఇరాన్ ఓ ప్రత్యేక దళాన్నే సిద్ధం చేసింది. అయితే ఇది పూర్తి స్థాయిలో రంగంలోకి దిగలేదు. అమెరికా మూడు భారీ యుద్ధ విమాన వాహక నౌకలను గల్ఫ్ ప్రాంతానికి పంపినా.. అవి హర్మూజ్ వైపు వచ్చేందుకు తటపటాయిస్తున్నాయి. మరోవైపు ఐఆర్‌జీసీ మాత్రం అమెరికా నౌకలు ఎప్పుడు వచ్చినా అభ్యంతరం లేదని.. వాటికి తగిన సమాధానం చెబుతామని ప్రకటిం చింది. అగ్రదేశాల రక్షణ వ్యవస్థలను అలసిపోయేలా చేసే ఆయుధాలతో ఇరాన్ దళాలు హర్మూజ్ వద్ద సిద్ధంగా ఉన్నాయి.

**ఏమిటీ మస్కిటో ఫ్లీట్..? :** ఇరాన్ చిన్నపాటి ఫాస్ట్ బోట్స్ ఇప్పటి వరకు యుద్ధంలో ఎటువంటి ప్రభావం చూపలేదు. కానీ సముద్ర దిగ్బంధ వ్యూహంలో "మస్కిటో ఫ్లీట్"గా పిలిచే ఈ చిన్న పడవలదే కీలకపాత్ర. దాదాపు 10 టన్నుల బరువుతో ఉండే ఈ రకం ఫాస్ట్ బోట్స్ 1,500 వరకు ఇరాన్ ఐఆర్‌జీసీ నేవీ వద్ద ఉన్నాయి. టెహ్రాన్‌కు చెందిన భారీ నౌకలను ధ్వంసం చేశామని సంబర పడుతున్న అమెరికాకు ఇవి షాకిస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంలో పీటీ బోట్ల వ్యూహాలను నేటి ఆధునిక యాంటీ షిప్ మిసైల్ బోట్లతో సమ్మిళితం చేసి ఇరాన్ వాడుతోంది. ఈ తరహా బోట్లు 300 వరకు ఉన్నట్లు అంచనా. నాసర్, కౌసర్ వంటి షార్ట్ రేంజి సూపర్ సోనిక్ గైడెడ్ క్షిపణులను వీటిపై అమర్చి వాడుతున్నారు. వీటితోపాటు తీర ప్రాంతాల నుంచి ప్రయోగించేలా ఘదెర్, జాఫర్, అబు మహదీ వంటి క్షిపణు లున్నాయి. ఇక ఈ చిన్న బోట్లు స్మార్ట్‌మైన్స్‌ను అమర్చడం వంటివి కూడా చేయ గలవు. ఈ పడవలు కేవలం 50 లేదా 110 నాట్స్ వేగంతో ప్రయాణించగలవు. సముద్రంపై చురుగ్గా కదలగలవు. గుంపుగా ఈ చిన్నబోట్లు దాడి చేస్తే.. భారీ యుద్ధ నౌకల టార్గెటింగ్ వ్యవస్థలు కూడా సమస్యలను ఎదుర్కొంటాయి. కొన్నాళ్ల క్రితం హర్మూజ్‌లో జరిగిన యుద్ధ విన్యాసాల్లో 40 బోట్లు పాల్గొన్నాయి. వాస్తవానికి ఈ జలసంధి ఇరుగ్గా ఉండటంతో పెద్ద నౌకలు వేగంగా అవసరమైన దిక్కుకు మళ్లే అవకాశాలు లేవు. దీంతో అవి చిన్న బోట్ల దాడులకు ఎరగా మారే అవకాశాలు ఎక్కువ.

